క్లుప్తంగా

ఘనంగా సామాలమ్మ వారాల పండగ



సామాలమ్మతల్లి గుడి వద్ద ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

బొండపల్లి: మండలంలోని గొల్లలపేట గ్రామంలో సామాలమ్మ తల్లి వారాల పండగను గ్రామస్తులు బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవారి గుడికి మేళ తాళాలతో వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు.మహిళలు చీరలు,పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అక్కడే సంహపక్తి భోజనాలు చేశారు.

వేంకటేశ్వరస్వామికి గరుడసేవ



గరుడ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

జామి: మండలంలో భీమసింగి వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధ వారం గరుడసేవను వైభవంగా నిర్వహించారు. వేద పండితులు ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం స్వామివారిని గరుడ వాహనంపై ఉంచి ఊరేగించారు.ఈ సందర్భంగా కోలాటం,తప్పెటగుళ్ల తదితర సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వాహకులు ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మహంకాళి ఆలయ హుండీల ఆదాయం లెక్కింపు



హుండీల ఆదాయం లెక్కిస్తున్న అధికారులు, సిబ్బంది

గజపతినగరం: దావాలపేట గ్రామంలోని మహంకాళి అమ్మవారి ఆలయ హుండీల ఆదాయం లెక్కింపును ధర్మవరం దేవస్థానం ఈఓ బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఏడాదిలో రూ.1,76,039 ఆదాయం వచ్చిందని ఈఓ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక ఈఓ కె.శ్రీరామ్,గ్రామ పెద్దలు బూడి వెంకటరావు,పాట్నూరు అప్పలరాము తదితరులు పాల్గొన్నారు.

సామూహిక అక్షరభ్యాసాలు



దబ్బిరాజుపేటలో పిల్లలతో అక్షరభ్యాసం చేయిస్తున్న ఉపాధ్యాయులు

వేపాడ: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం సామూహిక అక్షరభ్యాసాల కార్యక్రమం నిర్వహించారు. దబ్బిరాజుపేట, పాటూరు, రాయుడుపేట ప్రాథమిక పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు ఆర్.శంకరరావు, ఎం.సతీష్, పి.వెంకటరమణ ఆధ్వర్యంలో పిల్లలకు అక్షరభ్యాసం చేయించారు. పిల్లలతో ముందుగా సరస్వతీదేవి పూజ చేయించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ నరసింగరావు

శృంగవరపుకోట: బడి బయట ఉన్న బడి ఈడు పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలని మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ సాంబశివరావు, తహసీల్దార్ కిరణ్‌కుమార్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంఈఓలు బి.నరసింగరావు, పి.లక్ష్మి ఆధ్వర్యంలో 'నేను బడికి పోతా' కార్యక్రమంపై బుధవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 6 నుంచి 14 సంవత్సరాలు వయసు గల పిల్లలు అంతా బడిలో ఉండాలన్నారు. బడి ఈడు పిల్లలను గుర్తించి, పాఠశాల ల్లో చేర్పించేందుకు ప్రజాప్రతినిధులు,అధికారులు అంతా సహకరించాలని కోరారు.గిరిజన గ్రామాల్లో విద్యార్థుల డ్రాప్ అవుట్స్ లేకుండా చూడాలన్నారు. ఈఓపీఆర్డీ పి.లక్ష్మి, ఐసీడీఎస్ పీఓ బి.ఉమ పాల్గొన్నారు.

సికిల్‌సెల్ ఎనీమియా నిర్మూలనే లక్ష్యం



బొండపల్లి: కెరటాంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది, విద్యార్థులు



గజపతినగరం: మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో అవగాహన కల్పిస్తున్న వైద్యులు



వేపాడ: పీహెచ్‌సీలో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

బొండపల్లి/ గజపతినగరం/ వేపాడ: 2047 సంవత్సరానికి సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి రహిత భారతదేశ నిర్మాణమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం కార్యాచరణ రూపొందిం చిందని బొండపల్లి, మరుపల్లి, వేపాడ పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎల్.సత్యనారాయణ, సుష్మా,అనూజ్‌రాయ్, ధరణి, గుర్ల ఏపీఎం పి.నారాయణ తెలిపారు. సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిపై బుధవారం పలు గ్రామాల్లో వైద్యసిబ్బంది అవగాహన ర్యాలీలు, మండల కేంద్రాలు, పీహెచ్‌సీల్లో సదస్సులు నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యా ధికారులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఈ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. సికిల్‌సెల్ ఎనీమియా అనేది జన్యుపరమైన సమస్య అని చెప్పారు. శరీరంలోని అన్ని కణాలకు ఆక్సిజన్, పోషకాలను చేరవేసే ఎర్రరక్త కణాలను ఇది దెబ్బతీస్తుందని, ఈ జబ్బు బారినపడిన బాధితుల్లో ఎర్రరక్త కణాలు కొడవలి(సికిల్) లేదా నెలవంక రూపంలోకి మారిపోతాయని వివరించా రు. కణాలకు సరిగా ఆక్సిజన్, పోషకాలు అందక తీవ్రమైన ఒళ్లు నొప్పులు, రక్తహీనత, కళ్లు పుసుపు రంగులోకి మారడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు,అలసట, గర్భధారణ సమయంలో సమస్యలు వస్తాయని చెప్పారు. ఎక్కువ సార్లు నీరు తాగడం, డాక్టర్ సూచించిన మందులను క్రమం తప్పకుండా వాడడం, పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కొంతవరకు ఈవ్యాధి నుంచి ఉపశమనం పొందవచ్చని తెలిపారు. అనంతరం సంబంధిత వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. బొండపల్లి మండలం కెరటాంలో నిర్వహించిన ర్యాలీలో పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెం ట్ బి.విశ్వేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పీ మౌనిక, ఏఎన్ఎం గౌరీదేవి, ఆశ కార్యకర్తలు, గజపతినగరం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన సదస్సులో వెలుగు ఏపీఎం యు. జగదీష్ కుమార్, ఏపీఎంలు ఇందిరాదేవి, జి.దేముడు, గ్రామైక్య సంఘాల అధ్యక్షులు, వేపాడ పీహెచ్‌సీలో నిర్వహించిన కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఆంజనేయులు, వైద్యారోగ్యశాఖ సిబ్బంది, గుర్ల ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సదస్సులో గ్రామైక్య సంఘాల సభ్యులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



గుర్ల: వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏపీఎం నారాయణరావు, గ్రామైక్య సంఘాల సభ్యులు

నవధాన్యాల సాగుతో భూమి సారవంతం



ఆతవలో రైతులకు నవధాన్యాల కిట్‌లు అందజేస్తున్న ప్రకృతి వ్యవసాయ రీజనల్ అధికారి హేమసుందర్



సీతంపేటలో నువ్వు పంటలో అంతర పంటలను పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయ అధికారులు

వేపాడ: నవధాన్యాల సాగుతో భూమి సారవంతమవుతుందని ప్రకృతి వ్యవసాయం రీజనల్ అధికారి హేమసుందర్ అన్నారు. మండలంలోని భర్తవానిపాలెం గ్రామంలో చిరు ధాన్యాల సాగును, సీతంపేట, ఆతవ గ్రామాల్లో నువ్వు పంటలో అంతరపంటల సాగును పరిశీలించారు. అలాగే రాయుడుపేట, పెదకృష్ణరాజుపురం గ్రామాల్లో రైతులకు నవధాన్యాల కిట్‌లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ వరి పంట వేసే ముందు ఆ పొలాల్లో నవధాన్యాలు, పచ్చిరొట్ట, చిరుధాన్యాలు సాగుచేస్తే భూసారం పెరిగి పంట అధిక దిగుబడి వస్తుందని చెప్పారు. రసాయన ఎరువుల వినియోగం కూడా తగ్గుతుందన్నారు. అంతర పంటల సాగుద్వారా అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. సీఎస్‌పీ కో- ఆర్డినేటర్ పెదవెంకటరావు, ఎంటీఎల్ వసంత, సన్యాసమ్మ, త్రిమూర్తులు, ఈశ్వరారావు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ



శిక్షణ పొందుతున్న యువత

శృంగవరపుకోట: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్. కేశవరావు, స్కిల్ ఆఫ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ జి.ఈరన్న బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. శిక్షణకు 18 నుంచి 28 సంవత్సరాల మధ్య ఉన్న ఇంటర్మీడియట్, డిగ్రీ పాసైన యువతీ, యువకులు అర్హులని పేర్కొన్నారు. మూడు నెలల శిక్షణ పూర్తయిన తర్వాత ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. పాత బ్యాచ్‌కు శిక్షణ ముగియనుందని, కొత్త బ్యాచ్‌కు శిక్షణ త్వరలో ప్రారంభించనున్నామని వివరించారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 24వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు 90002 34642, 79956 91295 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

విద్యార్థులకు స్టీల్ కంచాల పంపిణీ



విద్యార్థులకు స్టీల్ కంచాలు పంపిణీ చేస్తున్న దాత, ఉపాధ్యాయులు

చీపురుపల్లి: పట్టణంలోని వంగపల్లిపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 80 మంది విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన డబ్బాడ లక్ష్మనాయుడు బుధవారం స్టీల్ కంచాలు, పెన్నులు పంపిణీ చేశారు. దాత లక్ష్మనాయుడు మాట్లాడుతూ తన కుమారు డు రోహాన్స్ పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు స్టీల్ కంచాలు, పెన్నులు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. హెచ్ఎం సౌదామణి, ఉపాధ్యాయులు మాట్లాడుతూ జన్మదినోత్సవాల సందర్భంగా వృథా ఖర్చులు చేయకుండా సేవా కార్యక్రమాలు చేయించడం పిల్లలకు చిన్నప్పటి నుంచే తల్లిదండ్రులు అలవాటు చేయాలన్నారు. ఉపాధ్యాయులు వలిరెడ్డి రవీంద్రనాయుడు, ఎస్.బలరాం, జానకీరామయ్య, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్షయ నిర్ధారణకు విరివిగా వైద్యశిబిరాలు



శిబిరంలో విద్యార్థులను పరీక్షిస్తున్న సీహెచ్‌సీ సూపరింటెండెంట్ నాయక్, వైద్య సిబ్బంది

చీపురుపల్లి: క్షయ (టీబీ)వ్యాధి నిర్ధారణ కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, అందులో భాగంగానే విరివిగా వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ) సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.పి.వి.నాయక్ తెలిపారు. స్థానిక సీహెచ్‌సీలో విద్యార్థుల కోసం బుధవారం ప్రత్యేకంగా టీబీ నిర్ధారణ వైద్య శిబిరం నిర్వ హించారు. ఈసందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ గౌరీశంకర్, డీసీహెచ్ఎస్ కె.రాణి, డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కర్‌రావు ఆదేశాల మేరకు ఈ బిరం నిర్వహించినట్లు చెప్పారు. విద్యార్థుల నుంచి కఫం రహిత నమూనాలను వైద్య సిబ్బంది సేకరించామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో టీబీ లక్షణాలు ఉన్న చిన్న పిల్లలను గుర్తించడంలో ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు చురుగ్గా వ్యవహరించాలన్నారు.

రైతులందరికీ వరి విత్తనాలు అందజేయాలి



గంట్యాడ: రామవరంలో రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ హైమావతి



దత్తిరాజేరు: మరడాంలో రెతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న వీఏఏ కృష్ణవేణి, నాయకులు

గంట్యాడ: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి విత్తనాల కోసం రైతు భరోసా కేంద్రాల్లో(ఆర్బీకే) పేర్లు నమోదు చేసుకున్న రైతులందరికీ విత్తనాలు అందజేయాలని వ్యవసాయ అధికారులు, సిబ్బందికి ఎంపీపీ పీరుబండి హైమావతి ఆదేశించారు. మండలంలోని రామవరం గ్రామంలో రైతులకు రాయితీపై వరి విత్తనాలను బుధ వారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విత్తనాలు,ఎరువుల కోసం రైతులు ఇబ్బందిపడకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవా లన్నారు. జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, సర్పంచ్ పీరుబండి పద్మావతి, ఏఓ బి.శ్యామ్‌కుమార్, ఉప సర్పంచ్ అప్పలనాయుడు, పంచాయతీ కార్యదర్శి ఎల్.తవుడు, వీఏఏ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మరడాం ఆర్బీకేలో..

దత్తిరాజేరు: మండలంలోని మరడాం రైతు భరోసా కేంద్రం (ఆర్బీకే)లో రైతులకు ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రాయితీపై వరి విత్తనాలను వీఏఏ కృష్ణవేణి బుధవారం పంపి ణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయం పరిధిలో ఆరు గ్రామాల రైతులకు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం 500 క్వింటాళ్ల విత్తనాలు సరఫరా చేసిందని వివరించారు. వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగుకు ప్రోత్సాహం



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ స్వాతికుమారి

- సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

లక్కవరపుకోట: ఉపాధి హామీ పథకంలో భాగంగా పండ్లతోటలు సాగు చేసేందుకు ముందుకు వచ్చే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందజేస్తోందని ఆ పథకం ఏపీఎం విజయలక్ష్మి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. శాఖల వారీగా అధికారులు ప్రగతి నివేదికలను సభకు వివరించారు. మండల వ్యవసాయశాఖ అధికారి స్వాతికుమారి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి విత్తనాల పంపిణీ ప్రారంభించామని, ఈ ఏడాది కొత్తరకం విత్తనాలను రైతులకు పరిచయం చేస్తున్నామని చెప్పారు. ఎంఈఓ సీహెచ్.కూర్మారావు మాట్లాడుతూ 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు షూస్, యూనిఫాం తప్పించి మిగిలినవన్నీ స్టూడెంట్ కిట్ పేరిట విద్యా ర్థులకు అందజేశామని తెలిపారు. బడిబయట ఉన్న 6 నుంచి 14 ఏళ్లలోపు పిల్లలను గుర్తించి, వారిని పాఠశాలల్లో చేర్పించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. విద్యుత్‌శాఖ ఏఈ మాట్లాడుతూ కొన్నిగ్రామాల్లో అదనపు స్తంభాల ఏర్పాటుకు నిధులు మంజూరు కావాల్సి ఉందన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ చంద్రకళ మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో తాగునీటి సమస్య లేదని, జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింట కుళాయిల ఏర్పాటు పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. రేగ ఎంపీటీసీ బొడ్డు గణపతి మాట్లాడుతూ మండలంలోని గోల్డ్‌స్టార్ జంక్షన్ నుంచి కళ్లేపల్లి వెళ్లే రోడ్డులో దొంగల బెడద ఎక్కువగా ఉందని, పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. చందులూరు ఎంపీటీసీ యడ్ల కిశోర్ మాట్లాడుతూ చందులూరు గ్రామ రైతులకు ఎక్కువ శాతం వేపాడ మండలంలో సాగుభూములు ఉన్నాయని, వారికి కూడా వరి విత్తనాలు అందజేయాలని కోరారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని ఏఓ తెలిపారు. ఎంపీడీఓ కె.రూపేష్, తహసీల్దార్ ప్రసాదరావు, వైస్ ఎంపీపీ శ్రీనురాజు, పలు గ్రామాల ఎంపీటీసీలు,సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న జిందాల్ కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న జిందాల్ కార్మికులు

కొత్తవలస: అప్పన్నపాలెం గ్రామ సమీపంలోని జిందాల్ స్టెయిన్‌లెస్‌స్టీల్ కర్మాగారం లాకౌట్‌ను ఎత్తి వేయాలని కార్మికులు చేస్తున్న నిరసన కార్యక్రమం బుధవారం నాటికి 34వ రోజుకు చేరుకుంది.కర్మాగారం ప్రధాన గేటువద్ద వంటావార్పు కార్యక్రమాలతో పాటు ఇదివరకు కొత్తవలస జంక్షన్‌లో, విజయనగరం కలెక్టరేట్ వద్ద కార్మికులు ఆందోళన చేశారు. నిరసన దీక్షల శిబిరం వద్ద బుధవారం పలువురు కార్మికులు మాట్లాడుతూ కర్మాగార యాజమాన్యం మొండివైఖరిని విడనాడాలని కోరారు. యాజమాన్యం స్పందించకుంటే ఉద్యమాన్ని మరింత తీవ్రం చేస్తామని హెచ్చరించారు.

గుజ్జింగివలసలో పారిశుద్ధ్య పనులు



చెత్తను ట్రాక్టర్ ద్వారా తరలిస్తున్న కార్మికులు

గుర్ల: మండలంలోని గుజ్జింగివలసలో సర్పంచ్ రెడ్డి పద్మావతి బుధవారం పారిశుద్ధ్య పనులు చేయించారు. గ్రామంలోని అన్ని వీధి కాలువల్లో పూడిక, చెత్తను పారిశుద్ధ్య కార్మికులతో తీయించారు. చెత్తను ట్రాక్టర్ ద్వారా గ్రామం నుంచి బయటకు తరలించారు.

సేవలే గుర్తింపునిస్తాయి



కొత్తవలస: కొత్తవలస ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు కనకయ్యను సన్మానిస్తున్న యూటీఎఫ్ సంఘ నాయకులు



చీపురుపల్లిరూరల్(గరివిడి): బీపీఎం అప్పారావు, పద్మావతి దంపతులను సన్మానిస్తున్న పోస్టల్ అధికారులు

కొత్తవలస: ఏ రంగంలో పనిచేసే ఉద్యోగికైనా విధి నిర్వహణలో అందించిన సేవలే సమాజంలో ప్రత్యేక గుర్తింపునిస్తాయని యూటీఎఫ్ మండల శాఖ కార్యదర్శి జి.విజయగౌరి అన్నారు. కొత్తవలస ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిగా పనిచేసి ఉద్యోగ విర మణ చేసిన ములగాడ కనకయ్యను ఆ పాఠశాలలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా విజయగౌరి మాట్లాడుతూ కనకయ్య ఎంతో నిబద్ధతతో పనిచేశారని కొనియాడారు. యూటీఎఫ్ సంఘ నాయకులు ఎస్.ఎస్.ప్రసాద్, వి.సురేష్‌కుమార్, కోన వెంకటరావు, కె.కృష్ణకుమారి, జి.వెంకటనాయుడు, పి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బీపీఎంకు సన్మానం

చీపురుపల్లిరూరల్(గరివిడి): గుర్ల మండలంలోని లవిడాం పోస్టాఫీస్‌లో బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్(బీపీఎం)గా సేవలందించి ఉద్యోగ విరమణ చేసిన ఆర్.అప్పారావు ను గరివిడి శ్రీరాంనగర్ పోస్టల్ కార్యాలయంలో ఉన్నతాధికారులు బుధవారం సన్మానించారు. 44ఏళ్లుగా అప్పారావు అందించిన సేవలను అధికారులు కొనియాడారు. చీపురుపల్లి పోస్టల్ ఇన్‌స్పెక్టర్ జి.అచ్యుతరావు, ఎస్‌పీఎం టి.రామారావు, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటడం సామాజిక బాధ్యత



పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న ఆర్టీసీ డిపో మేనేజర్ రమేష్, ఉపాధ్యాయులు

శృంగవరపుకోట: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం సామాజిక బాధ్యతగా తీసుకోవాలని స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ కె.రమేష్ అన్నారు. పట్టణంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్(జియో) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవా రం మొక్కలు నాటారు. అతిథిగా హాజరైన ఆర్టీసీ డిపో మేనేజర్ మాట్లాడుతూ చిన్నతనం నుంచే మొక్కలు నాటడం అలవాటుగా మార్చుకో వాలని విద్యార్థులకు సూచించారు. హెచ్ఎం జి.జగదీశ్వరరావు, జియో వ్యవస్థాప కులు బి.రామకృష్ణ, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ వేమల గోవింద, పీడీ జి.లక్ష్మణరావు, ఉపాధ్యాయులు ఎస్.రఘు, దుర్గా లక్ష్మి, సుభాష్, రమేష్‌కుమార్,వాసుదేవరావు పాల్గొన్నారు.

విపత్తులపై అవగాహన



మాట్లాడుతున్న విపత్తుల నిర్వాహణ మేనేజర్ రాజేశ్వరి

గంట్యాడ: ప్రకృతి విపత్తులు సంభవించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండలంలోని తామరపల్లి జంక్షన్ వద్ద బాలాజీ ఫంక్షన్ హాల్లో ప్రజలకు విపత్తుల నిర్వాహణ మేనేజర్ ఎం.రాజేశ్వరి బుధవారం అవగాహన కల్పించారు. వరదలు, అగ్నిప్రమాదాలు, రోడ్డు ప్రమా దాలు, తదితర విపత్తులు సంభవించినప్పుడు ప్రాణ,ఆస్తినష్టం జరగకుండా ఏలా ప్రతిస్పందించాలో వివరించారు. తహసీల్దార్ నీలకంటేశ్వర రెడ్డి, ఎన్‌డీఆర్ ఇన్‌స్పెక్టర్ సుశాంత్‌కుమార్, అగ్నిమాపక శాఖ అధికారి షేక్ మదినా తదితరులు పాల్గొన్నారు.